కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానానికి సాటి మరొకటి లేదు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానానికి సాటి ప్రపంచంలోనే మరొకటి లేదని ఎన్ఐటీ ప్రొఫెసర్ రమణమూర్తి అన్నారు. రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. బుధవారం ఉదయం యోగాసనాలతో మొదలైన ఈ శిబిరంలో ఉదయం వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రమణమూర్తి, కాకతీయ కట్టడాల నిర్మాణాలు, వాడిన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ప్రముఖ ఆర్కిటెక్, హిస్టోరియన్ వేదకుమార్ కాకతీయుల చరిత్ర, వాటి విశిష్టత, తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల చరిత్ర, రాజవంశీయుల పాలనపై వివరించారు. మధ్యాహ్నం హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటీ ప్రొఫెసర్ కేపీ రావు మానవ పరిణామక్రమం ఏ విధంగా మొదలైందో వివరించారు. శిబిరం నిర్వహణలో ప్రత్యేక చొరవ తీసుకుని నిరంతరం పనిచేస్తున్న కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ప్రొఫెసర్ పాండు రంగారావును వారు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్, టూరిజం, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.



కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ప్రొఫెసర్ పాండురంగారావును సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

పేదల అభ్యున్నతే భాజపా లక్ష్యం

ములుగు రూరల్, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే భాజపా లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం అన్నారు. బుధవారం ములుగు మండలం జంగాలపల్లిలోని వారాంతపు సంతలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్, కోశాధికారి గంగుశెట్టి రాజ్‌కుమార్, మండల అధ్యక్షులు గాదం కుమార్, మండల ఉపాధ్యక్షులు కట్టయ్య, రవిరెడ్డి, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

ములుగు, న్యూస్‌టుడే: అధికారులు సమన్వయంతో సమష్టిగా పని చేసి ధాన్యం సేకరణను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఎఫ్ఏక్యూ ప్రమాణాలను అనుసరించి కొనుగోళ్లు జరపాలని, రైతులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ఏమైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం మిల్లులకు తరలించే విషయంలో సమస్యలెదురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. తేమ మిషన్లు, గోనె సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చూడాలని, కేంద్రాల వద్ద వసతులు కల్పించాలన్నారు. సన్న, దొడ్డు ధాన్యం కేంద్రాలు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని, సన్న ధాన్యం నింపిన సంచులకు ఎర్రదారంతో కుట్టాలని, ఎస్ అనే అక్షరం ముద్రించాలన్నారు. దొడ్డు ధాన్యం నింపిన గోనె సంచులకు ఆకుపచ్చ దారంతో కుట్టాలన్నారు. రైతులు, ఇతరుల సౌకర్యార్థం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 24 గంటలు అందుబాటులో ఉంటారని, సమస్యలుంటే 9347416178 నెంబరులో సంప్రదించాలని కోరారు. అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, జిల్లా సహకార అధికారి సర్దార్‌సింగ్, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం రాంపతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి షాఫైజుల్ హుస్సేన్, ఎఫ్‌సీఐ డీఎం ప్రకార్ వర్మ, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, వివిధశాఖల అధికారులు, రైసు మిల్లుల యజమానులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సమాచార సేకరణ చేయాలి

ములుగు, న్యూస్‌టుడే: సమగ్ర కుటుంబ సమాచార సేకరణపై ఉమ్మడి జిల్లాల పరిధిలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర పాల్గొన్నారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా అన్నివర్గాల ప్రజల సమగ్ర సమాచార సేకరణ చేయాలని సూచించారు. నవంబర్ 2న హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి గణనపై విజ్ఞాపనలు స్వీకరించనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరు పాల్గొని వారి విజ్ఞాపణలు ఇవ్వాలని కోరారు. కలెక్టర్లు ఈ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి నిష్పక్షపాతంగా సర్వేపూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 24న అన్ని కులాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా బీసీ సంక్షేమాధికారిని ఆదేశించారు. నవంబర్ 2న జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో అన్ని వర్గాల వారు పాల్గొనేలా సమాచారం ఇవ్వాలన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర

బకాయిలు విడుదల చేయాలని రాస్తారోకో

ములుగు, న్యూస్‌టుడే: విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండు చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ములుగులోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మమన్ మాట్లాడుతూ.. గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, ప్రస్తుత ప్రభుత్వం సైతం అదేవిధంగా ఉందన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నా.. విద్యారంగానికి బడ్జెట్‌లో కనీస నిధులు కేటాయించకపోవడం దారుణమని, విద్యారంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. నగర కార్యదర్శి అఖిల్, నాయకులు శ్రీనాథ్, సాయిరాం, మహేష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



దోమల మోత.. చలితో వెత..!

వెంకటాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. విద్యార్థులకు ఇక్కడి అసౌకర్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. శిథిల భవనాలు, అపరిశుభ్ర పరిసరాలు పేద, మధ్యతరగతి బిడ్డలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. చలికాలం ఆరంభమైనా రక్షణ చర్యలు ఊసు లేకపోవడంతో ఇక్కట్లు వెంటాడుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలను 'న్యూస్‌టుడే' బృందం బుధవారం పరిశీలించింది.

పరిశీలన

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే..

వసతి గృహాల్లో కనీస సదుపాయాల కల్పన కాగితాల్లోనే మూలుగుతోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు, నీటి సదుపాయం, భవనాల మరమ్మతులకు ఏటా ప్రతిపాదనలు చేస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు. గిరిజన సంక్షేమశాఖ ద్వారా నిధులను కేటాయించినట్లు చెబుతున్నా పనులు అసంపూర్తిగానే వెక్కిరిస్తున్నాయి. ఎస్సీ విభాగానికి చెందిన హాస్టళ్లలో సుమారు రూ.50 లక్షలతో ప్రతిపాదించినా ప్రయోజనం శూన్యం. బీసీ సంక్షేమ శాఖకు చెందిన భవనాల మరమ్మతులకు ఒక్కోచోట రూ.4 నుంచి రూ.5 లక్షల నిధులు అవసరమున్నా.. మంజూరు లేదు. పాలకులు, ఉన్నతాధికారులు దృష్టిసారిస్తేనే ప్రయోజనం.

ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం..

గిరిజన సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కనీస సదుపాయాలను కల్పించాం. అదనపు వసతులకు ఏర్పాట్లు చేస్తున్నాం. మరమ్మతులకు సంబంధించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని డీడీ పోచం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. దుప్పట్లను హాస్టళ్లకు సరఫరా చేసే ప్రక్రియ చేపట్టామని, విద్యార్థులకు త్వరలోనే అందజేస్తామని జిల్లా బీసీ సంక్షేమాధికారి సీహెచ్ రవీందర్‌రెడ్డి తెలిపారు. వసతి గృహాల బాగుకు ప్రతిపాదనలు చేశామని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్సీ సంక్షేమ వసతి గృహాల జిల్లా అధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు.

సొంత దుప్పట్లే దిక్కు



వసతి గృహాల్లోని విద్యార్థులకు నేటికీ దుప్పట్లు పంపిణీ చేయలేదు. విద్యాసంవత్సరం మొదలై ఐదు నెలలు గడుస్తున్నా.. పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వెంకటాపురం బీసీ బాలుర వసతి గృహంలో 52 మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వం అందించే దుప్పట్లు రాకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్నవే ఆధారంగా మారాయి. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, నీటి నిల్వలతో అధ్వాన్నంగా ఉంది. ● వాజేడు మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహంలో మొత్తం 30 మంది ఉన్నారు. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లే ఉపయోగిస్తున్నారు. కిటికీలకు జాలీలు లేకపోవడంతో.. దోమల బెడద ఎక్కువైందని విద్యార్థులు చెబుతున్నారు.

● ఏటూరునాగారం బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో 46 మంది విద్యార్థులున్నారు. ఇళ్ల నుంచి తెచ్చుకున్నవే వాడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం**

వేడినీటి యంత్రానికి మరమ్మతులు కరవు



వెంకటాపురం ఎస్టీ బాలుర వసతి గృహంలో వంద మంది విద్యార్థులున్నారు. వీరికోసం సౌరశక్తితో నీళ్లను వేడిచేసే పరికరాన్ని అమర్చారు. అది కొన్నాళ్లుగా మూలనపడటంతో విద్యార్థులకు చన్నీటి స్నానమే దిక్కయింది. మూత్రశాలలు, స్నానపుగదుల తలుపులు విరిగిపోయాయి. వృథా నీరు బయటికి వెళ్లేందుకు అవకాశం లేక పరిసరాలు బురదమయంగా మారాయి.

దాతలూ.. స్పందించండి!

చలికాలం సమీపిస్తోంది. ప్రభుత్వ వసతిగృహాల్లో పేద విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. చాలా వసతి గృహాల్లో పిల్లలకు దుప్పట్లు ఇంకా అందలేదు. కిటికీలకు తలుపులు లేక, దోమలు రాకుండా జాలీలు లేక సతమతమవుతున్నారు. చలిలో వణుకుతూ దోమలతో యుద్ధం చేస్తూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈనేపథ్యంలో వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి దాతలు, స్పందించి సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది. స్థానికులు, ప్రజా ప్రతినిధులు కూడా చేయూత అందిస్తే మేలు.

కిటికీ తలుపులు వంగిపోయాయి..



గోవిందరావుపేటలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని గదుల కిటికీల తలుపులు వంగిపోయాయి. దోమల కోసం అమర్చిన తెరలు చిరిగిపోయాయి. కిటికీల నుంచి చలిగాలులతో పాటు దోమలు వస్తుండటంతో.. వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. గదుల్లోని ఫ్యాన్లు సైతం సరిగా తిరగడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, గోవిందరావుపేట**

చలి రాకుండా దుప్పటి



ములుగు టౌన్, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్టీ సంక్షేమ వసతి గృహంలో కిటికీలకు తలుపులు సరిగా లేవు. చలి నుంచి రక్షణగా ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లను కిటికీలకు అడ్డంగా కట్టుకున్నారు. ప్రతి ఏటా చలికాలమంతా చన్నీటి స్నానం చేయాల్సి వస్తుందని తెలిపారు.

చన్నీటి స్నానమే దిక్కు



ములుగు జిల్లా కేంద్రంలో ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఇందులో ఉంటున్న విద్యార్థుల కోసం మూడేళ్ల క్రితం వేడి నీటి యంత్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అవి మరమ్మతులకు గురికావడంతో.. చన్నీటి స్నానం చేయాల్సి వస్తోంది.

విద్యుత్తు స్తంభం ముప్పు తప్పించారు!





ఈనాడు కథనాలకు స్పందన

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండల కేంద్రంలోని ఎస్సీమ్రిగూడెంలో విద్యుత్తు స్తంభం ముప్పును ఎట్టకేలకు తప్పించారు. నడిరోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న స్తంభం పరిస్థితిని ఉదహరిస్తూ.. ఈ నెల 8వ తేదీన 'స్తంభం ముప్పు.. కలగాలి కనువిప్పు', ఈ నెల 17న 'స్తంభం తొలగించకుండానే రోడ్డేశారు' అనే శీర్షికతో కథనాలు ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనాలకు స్పందించిన విద్యుత్తు శాఖ ఏడీఈ స్వామి రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రహదారి మధ్యలో అపాయంగా ఉన్న స్తంభాన్ని తొలగింప చేసి అదే ప్రాంతంలో రోడ్డుకు చివరన మరోదాన్ని ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా ఉన్న సమస్య ఇన్నాళ్లకు మోక్షం కలగడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

మరో ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తున్న ఏడీఈ స్వామిరెడ్డి

అదుపు తప్పితే అంతే..!



ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి నుంచి దొడ్ల గ్రామానికి వెళ్లే దారిలో షాపల్లి గ్రామం వద్ద కల్వర్టు నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవలే ఈ మార్గాన్ని రెండు వరుసల దారిగా వట్టివాగు నుంచి షాపల్లి గ్రామ శివారు వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర నిర్మాణం పూర్తి చేశారు. ఈ వానాకాలంలో రహదారి కోతకు గురవుతోందని ఇక్కడ కల్వర్టు నిర్మించారు. గోడలు లేపి పై స్లాబు వేయకుండా కల్వర్టును అసంపూర్తిగా వదిలేశారు. దీని నిర్మాణం పూర్తయ్యేవరకు రాకపోకల కోసం పక్కనుంచి వెళ్లేందుకు డైవర్షన్ దారి నిర్మించారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు సంబంధిత డైవర్షన్ రోడ్డు కోతకు గురైంది. ఈ మార్గంలో ఏ మాత్రం అదుపుతప్పినా.. ప్రాణాలకే ప్రమాదం. రాత్రివేళల్లో ప్రయాణం నరకంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏటూరునాగారం**

ఏక్ పోలీస్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి


చల్వాయి జాతీయరహదారిపై రాస్తారోకో చేస్తున్న బెటాలియన్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్ల సతీమణులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగానే బెటాలియన్‌లో కానిస్టేబుళ్లుగా పని చేసే తమ భర్తలు సైతం కుటుంబ బాధ్యలకు అందుబాటులో ఉండేలా వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏక్ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని టీఎస్ఎస్పీ ఐదో బెటాలియన్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్ల సతీమణులు అన్నారు. బుధవారం చల్వాయిలోని జాతీయరహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టి ఏక్ పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చల్వాయి గ్రామంలోని టీఎస్ఎస్పీ ఐదో పోలీసు బెటాలియన్‌లో పని చేస్తున్న తమ భర్తలు నెలలో నాలుగు రోజులు మాత్రమే ఇళ్లకు వస్తున్నారని, మిగిలిన 26 రోజులు విధి నిర్వహణలో ఉంటున్నారన్నారు. ఇంట్లోని చిన్నపిల్లలు, పెద్ద వారికి ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తితే తామే ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా పిల్లలు తన తండ్రి కోసం వేచి చూసి రోదిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న విధంగా బెటాలియన్‌లో పని చేసే వారికి అలాంటి అవకాశమే కల్పించాలని కోరారు.

వనదేవతల ఆదాయం రూ.26.81 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న వాలంటీర్లు

మేడారం (తాడ్వాయి), న్యూస్‌టుడే: సమ్మక్క, సారలమ్మ వనదేవతలకు భారీగా కానుకలు లభించాయి. గత నాలుగు నెలలుగా భక్తులు సమర్పించిన 20 హుండీల్లోని కానుకలను మేడారంలోని భోజనశాలలో బుధవారం లెక్కించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం తెలిపారు. సమ్మక్క దేవతకు రూ.13,85,398 సారలమ్మ దేవతకు రూ.12,09,392 పగిడిద్దరాజుకు రూ.47,331, గోవిందరాజుకు రూ.39,519 భక్తులు కానుకలు సమర్పించారు. మొత్తం రూ.26.81 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో హుండీ ఇన్‌స్పెక్టర్ కవిత, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ప్రధాన కార్యదర్శి చందా గోపాల్‌రావు, కార్యదర్శి కాక సారయ్య, పూజారులు చందా రఘుపతిరావు, సిద్దబోయిన మునీందర్, బోజారావు, కాక కిరణ్‌కుమార్, ఎమ్మారై సాంబయ్య, బ్యాంకు అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి స్వల్పంగా పెరిగిన వరద

మహదేవపూర్, న్యూస్‌టుడే : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీకి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. బ్యారేజీకి 82,330 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో 1,23,290 క్యూసెక్కులకు పెరిగింది. దిగువకు వరదనీటిని వదులుతున్నారు.


ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


స్వాగత వేడుకలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ రేణుక, అధ్యాపకులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కొత్తగా ప్రథమ సంవత్సర డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు తృతీయ సంవత్సర విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డా.బి.రేణుక కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులంతా పరస్పర సోదర భావంతో ఉండాలన్నారు. ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని, లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. అధ్యాపకులు డా.డి.నవీన్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త సీహెచ్.వెంకటయ్య, ఐక్యూఏసీ సంధానకర్త డా.పి.జ్యోతి, కనీస్ ఫాతిమా తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ.. లాఠీ తప్పుతోంది!

తాజాగా ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్‌పై కాజీపేట ఠాణాలో పోక్సో కేసు నమోదు కావడం సంచలనం సృష్టించింది.



స్నేహపూర్వక పోలీస్ వ్యవస్థ అని చెబుతూ కొందరు పోలీసులు గాడి తప్పి వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన చోట కొంతమంది హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. వీరితో మొత్తం పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తోంది. అవినీతి, అక్రమ వసూళ్లు నుంచి మహిళలు, చిన్నారులపై అత్యాచారాల వరకు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో పోలీసు అధికారులపైనే కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.

– న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం

ఫిర్యాదు చేసేందుకు భయం

పోలీసుశాఖలో వరుస ఘటనలు వెలుగు చూస్తుండడంతో సామాన్యులు ఠాణాలకు వచ్చి ఫిర్యాదులు చేసేందుకు భయపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

అక్రమ కేసులు, ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న పోలీసు అధికారులపై తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నా కొద్ది రోజుల తర్వాత రాజకీయ నాయకుల అండదండలతో బయటకు వస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో కీలకమైన విభాగాల్లో పోస్టింగ్‌లు పొందుతున్నారు. తర్వాత కేసు విచారణ సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆరోపణలను రద్దు చేయించుకుంటున్నారు.

రాజకీయ జోక్యం తగ్గాలి

పోలీసు శాఖ పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం తగ్గితే చాలా వరకు మార్పులు వస్తాయి. ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తే కొంత వరకు ప్రజలకు మేలు జరుగుతుంది.

ఈ ఏడాది వరుస ఘటనలు..

- కేయూ ఠాణాలో పనిచేసిన ఎస్సై అనిల్ మరో ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని వేధించాడు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- జయశంకర్‌భూపాల్‌పల్లి జిల్లాలో పని చేస్తున్న సీఐ సంపత్ కేయూ ఠాణా పరిధిలో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురుపైనా అత్యాచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- పోలీసు శాఖలోని ఇతర విభాగంలో పనిచేస్తున్న సీఐ చింతగట్టు సమీపంలో అతిథి గృహంలో మహిళతో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లేసరికి మహిళను తప్పించాడు. అనంతరం పోలీసులు దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.
- గత ఏడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్, మహిళ ఎస్సైతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు ఇన్‌స్పెక్టర్, ఎస్సై ఇద్దరిని సస్పెండ్ చేశారు.



ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

● హనుమకొండకు చేరుకున్న ఎలక్ట్రికల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



ప్రజా రవాణా వ్యవస్థ అనగానే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది ఆర్టీసీ. బస్సులు నిత్యం లక్షల కిలోమీటర్లు తిరుగుతూ వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఆధునిక వసతులతో మరింత సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల ఆదరణ పొందుతోంది. ఇప్పటికే రాజధాని, గరుడ లాంటి ఏసీ బస్సులు, లహరి వంటి స్లీపర్ క్లాస్ బస్సులను ప్రవేశపెట్టింది. తాజాగా మరో అడుగు ముందుకేసి ఇంధన భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ఎలక్ట్రికల్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది.

మూడు రకాలుగా..

- పర్యావరణ హితంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సుల్లో వరంగల్ రీజియన్‌కు 84 కేటాయించారు.
- డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ మూడు రకాలు ఉంటాయి. వీటిని హైదరాబాద్ - వరంగల్, వరంగల్-కరీంనగర్ రూట్‌లో నడపనున్నారు.
- రీజియన్‌కు బుధవారం రాత్రి వరకు నాలుగు డీలక్స్, ఒకటి సూపర్ లగ్జరీ మొత్తం 5 బస్సులు చేరుకున్నాయి.
- సూపర్ లగ్జరీలో డ్రైవర్ సీటుతో కలిపి 42, డీలక్స్ బస్సుల్లో 45, ఎక్స్‌ప్రెస్‌లో 55 సీట్లు ఉంటాయి. వీటికి ఛార్జింగ్ అవసరం ఉన్నందున డిపోలో 12 ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.

'బస్సుల నిర్వహణ బాధ్యత జేబీఎం సంస్థకు అప్పజెప్పారు. వీటిని నడిపేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన డ్రైవర్లు అవసరం ఉండటంతో ఆ సంస్థనే నియామకాలు చేపట్టనుంది. ఆర్టీసీ.. కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇవి అద్దె ప్రాతిపదికనే నడుస్తాయి.'

మహాలక్ష్మి వర్తిస్తుంది..

ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం, ఇతర అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయి. సాధారణ ఛార్జీలే ఉంటాయి..

ఎలక్ట్రికల్ బస్సులకు గేర్లు ఉండవు

- చొల్లేటి కిరణ్, ఆర్టీసీ సీనియర్ డ్రైవర్, వరంగల్ 2 డిపో



మామూలు ఆర్టీసీ బస్సులకు గేర్లు ఉంటాయి. ఎలక్ట్రికల్ బస్సులకు ఉండవు. ఎక్కువ స్పీడ్ వెళ్లకుండా లాక్ చేస్తారు. సీటింగ్, ఇతర మొత్తం మామూలు బస్సుల లాగే ఉంటాయి. శబ్ద కాలుష్యం ఉండదు. వైబ్రేషన్ ఉండదు. అద్దె ప్రాతిపదికన కాకుండా ఆర్టీసీ సొంతంగా ఈ బసులను నిర్వహిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేది. దీంతో పాటు ఆర్టీసీ డ్రైవర్లుగా కొంత మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇవీ ప్రత్యేకతలు..



- 1.45 గంటలు ఛార్జింగ్ చేస్తే 350 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తాయి.
- ప్రయాణికులకు అత్యవసరమైతే బస్సును ఆపేందుకు ప్రతి సీటుపై ఎస్‌ఓఎస్ మీట పెట్టారు.
- బస్సుకు మొత్తం 5 సీసీ కెమెరాలు అమర్చారు. డ్రైవర్ సీటు ముందు భాగంలో కెమెరా మానిటరింగ్ చేసే విధంగా ఏర్పాటు చేశారు.
- ప్రతి సీటు వద్ద చరవాణి ఛార్జింగ్ పాయింట్ ఇచ్చారు.
- డ్రైవర్ మాట్లాడితే ప్రయాణికులకు వినపడేలా మైక్ సిస్టం ఏర్పాటు చేశారు.
- ఈ బస్సులకు ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం అందుబాటులో ఉంది. దీని ద్వారా బస్సు ఎక్కడ ఉందో జీపీఎస్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు.
- డోర్ తెరిచి ఉంటే బస్సు స్టార్ట్ కాదు. దీనికి గేర్ సిస్టం ఉండదు. కేవలం ఎక్స్‌లెటర్ మాత్రమే ఉంటుంది. గంటకు 80 కిలోమీటర్ల వేగానికి మించి పోకుండా స్పీడ్ లాక్ చేశారు.
- జీపీఎస్‌తో అనుసంధానమై ఉండటంతో ప్రయాణికులు గమ్యం యాప్ ద్వారా ఈ బస్సు ఎక్కడ ఉంది, ఎక్కడి వరకు వచ్చింది, గమ్యస్థానం చేరుకోవడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందుగానే పసిగట్టి అలారం మోగే విధంగా సాంకేతికతను ఉపయోగించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందేలా ఏర్పాటు చేశారు.



ఇటీవల కటాక్షపూర్ లో లెవెల్ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద..

ఎట్టకేలకు లభించిన కటాక్షం

● వంతెన నిర్మాణానికి మార్గం సుగమం..

ఎన్నో ఏళ్ల కల.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వంతెన నిర్మాణం.. ఎట్టకేలకు నెరవేరబోతోంది. ఈ వంతెనతోపాటు మరో చోట మూల మలుపును నేరుగా చేసేందుకు అవసరమైన భూ సేకరణ జరిపేలా బుధవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూ సేకరణ పూర్తయితే వంతెన పనులను చేపట్టనున్నారు.

పరకాల, న్యూస్‌టుడే

అత్యంత కీలకం..

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో కటాక్షపూర్ వంతెన నిర్మాణం అత్యంత కీలకం. కటాక్షపూర్ చెరువు వద్ద శిథిలావస్థకు చేరిన లో లెవెల్ కాజ్‌వేతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి పడి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు పర్యాటక ప్రదేశాలైన లక్నవరం, రామప్ప, బొగత జలపాతం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడం వల్ల అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉద్ధృతి ఉంటే పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతాయి.

భూసేకరణే ఆలస్యం..

కటాక్షపూర్ లెవెల్ కాజ్‌వే చోట వంతెన నిర్మించడానికి ఏడాదిన్నర కిందట రూ.312 కోట్లను విడుదల చేయగా టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది. వంతెనను వెడల్పుగా నిర్మించడానికి హౌజ్‌బూజుర్గు, కటాక్షపూర్ గ్రామాల మధ్య కొంతమేర భూ సేకరణ అవసరం. అదే సమయంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపును నేరుగా చేయడానికి సైతం ఇరువైపులా భూమి కావాలి. ఈ రెండు చోట్ల అవసరమైన భూ సేకరణకు అనుమతి ఇవ్వాలని ఆర్ అండ్‌బీ(జాతీయ రహదారి) అధికారులు నెల రోజుల కిందట కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు బుధవారం భూ సేకరణకు కేంద్ర రహదారి, రవాణా శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ బాధ్యతలను పరకాల ఆర్డీవోకు అప్పగించారు.. భూ సేకరణకు సర్వే చేసి బాధిత రైతులకు పరిహారం ఇచ్చిన వెంటనే వంతెనతోపాటు మూలమలుపును నేరుగా చేసే పనులు ప్రారంభం కానున్నాయి.

జులై వరకు గడువు..

163వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో నుంచి ఎటూ 50 ఫీట్లతో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను హనుమకొండ, ములుగు జిల్లాలో కలిపి మొత్తం 36 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో హనుమకొండ జిల్లాలో 20 కిలోమీటర్లు, ములుగు జిల్లాలో 10 కిలోమీటర్ల వరకు పనులు చేయాలి. వీటికిగాను రూ.208 కోట్లను విడుదల చేయగా 2022లో పనులను చేపట్టారు. వచ్చే ఏడాది జులై వరకు ఆ పనులను పూర్తి చేయడానికి గడువు.

● దీనిపై పరకాల ఆర్డీవో కె.నారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలకు ఇంకా తమకు రాలేదన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన శాతవాహన

వందేభారత్ సహా పలు రైళ్లు ఆలస్యం

డోర్నకల్, న్యూస్‌టుడే: విజయవాడ- సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ (12713) బుధవారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటాక కిలోమీటరు దూరంలో సాంకేతిక లోపంతో నిలిచింది. రైలింజన్ మీదుండే ప్యాంటో మొరాయించిందా? లేదా ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్‌లో సమస్య తలెత్తిందా అన్నది రైల్వే అధికారులే ఒక అంచనాకు రాలేకపోయారు. తర్వాత లోపాన్ని సరిదిద్ది రైలును నడిపారు. శాతవాహనకు ఉదయం 9.02 నుంచి 9.39 గంటల వరకు 37 నిమిషాలపాటు అంతరాయం కలగడంతో ఇతర రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గుండ్రాతిమడుగు దాటాక నిలిచిన ఒక గూడ్స్ రైలు మొరాయించడంతో మహబూబాబాద్ నుంచి మరో ఇంజిన్ పంపించి తీసుకొచ్చారు. ఈలోగా గుండ్రాతిమడుగు స్టేషన్‌లో విశాఖపట్నం- ముంబయి ఎల్‌టీటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్(18519) రైలు గంట, డోర్నకల్‌లో గుంటూరు- సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) గంట 10 నిమిషాలు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్(20833) ఎక్స్‌ప్రెస్ పాపటపల్లి రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా నిలిచాయి.

పట్టణాభివృద్ధికి శ్రీకారం!

● ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన విస్తరణ, అభివృద్ధి, నాణ్యమైన పట్టణవాసం కల్పించడమే లక్ష్యంగా జిల్లాకో పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- యూడీఏ)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గతంలో ఉన్న పట్టణాభివృద్ధి సంస్థలను అవసరమైన చోట విస్తరించాలని, ఇందుకు అవకాశాలు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా 18 సంస్థలను ఏర్పాటు చేయనుంది. - జనగామ, న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే వరంగల్, హనుమకొండ జిల్లాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి.'


'ఏజెన్సీ ప్రాంతం అత్యధికంగా ఉన్న జిల్లాలను ఈ ప్రక్రియ నుంచి మినహాయించారు. దీంతో ములుగు జిల్లాకు ఈ అవకాశం లేదు. మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి..'

యూడీఏ	వైశాల్యం (చ.కి.మీ),	జనాభా-2011	జనాభా(2024) అంచనా	పురపాలికలు /గ్రామాలు
జనగామ(జుడా)	1654.756	403516	454168	1/225
భూపాలపల్లి(బుడా)	2293	416763	462249	1/242
మహబూబాబాద్(ముడా)	1891.75	600101	654961	4/163

ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో..

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అధికారి(డీటీసీపీవో), ఆర్డీవోలు, పురపాలక కమిషనర్లు, సర్వే లాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా కేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011 జనాభా, ప్రస్తుత అంచనా జనాభా, ఏరియా తదితర వివరాలతో నక్షా(ప్లాన్) తదితర వివరాలతో ప్రతిపాదనను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

జనగామ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (జుడా)



'జనగామ మున్సిపల్ సహా 226 గ్రామాలను జుడా పరిధిలో చేర్చాలని ప్రతిపాదించారు.'

2017లో 10 మండలాలతో జనగామ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 12 మండలాలుండగా, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి. వాటిలో మార్పు లేదు. 283 గ్రామాలకు గాను.. ఈ జిల్లా సూర్యాపేట, భువనగిరి యాదాద్రి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది.



● విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న క్రమంలో రైలు, రోడ్డు, భూముల క్రయవిక్రయాలకు అనువుగా ఉన్న కారణంతో జుడా పరిధిలోకి తేవాలని ప్రతిపాదించారు.

భూపాలపల్లి (బుడా)

కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించి భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు, రెండు రాష్ట్రాలతో సరిహద్దు బంధం కలిగి ఉంది. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలు, సింగరేణి, కేటీపీపీ వంటి పరిశ్రమలు, కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రంగా ఉంది.

● ఎన్‌హెచ్ 353సి, ఎన్‌హెచ్ 163జితో అనుసంధానమై వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉన్నందున పట్టణీకరణకు విస్తార అవకాశాలున్నందున జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ అవసరమని ప్రతిపాదించారు.

'భూపాలపల్లి పురపాలిక సహా 242 గ్రామాలతో 'బుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు.'



మహబూబాబాద్ (ముడా)

ఎన్‌హెచ్ 365 పరిధిలోని మహబూబాబాద్ ఏడు జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది. ఎన్‌హెచ్ 563, ఎన్‌హెచ్ 930పి, ఎన్‌హెచ్ 163జిలతో అనుబంధాన్ని కలిగి ఉంది. సికింద్రాబాద్-విజయవాడ మధ్య రైలు సౌకర్యంతో ఉన్న జిల్లాలో భవిష్యత్తులో వ్యాపార, వాణిజ్య ఇతర రంగాల అభివృద్ధికి అన్ని అవకాశాలున్నందున ముడా ఏర్పాటుకు ప్రతిపాదించారు.

'మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ(4) పురపాలికలు, 163 రెవెన్యూ గ్రామాలతో ముడాను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.'



కొనుగోలుదారుల ఆదరణ పొందాలి



రిబ్బన్ కత్తిరించి షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నాణ్యమైన వస్త్రాలతో కొనుగోలుదారుల ఆదరణ పొందాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి అన్నారు. హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఏ వ్యాపారానికైనా కొనుగోలుదారుల నమ్మకమే ముఖ్యమన్నారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి కాసం నమఃశివాయ మొదటి కొనుగోలుదారుగా దుస్తులు కొన్నారు. షోరూం జీఎం సశింద్రన్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇదే పెద్ద షోరూం అన్నారు. దక్షిణ భారతంలో రామ్‌రాజ్ షోరూంలు అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ విజేత హనుమకొండ జట్టు



జట్టు సభ్యులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జట్టు విజేతగా నిలిచింది. హనుమకొండలోని రెడ్డిపురంలో ఉన్న టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో ఈ నెల 20 నుంచి 23 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ఛేదనకు దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. విజేత హనుమకొండ, రన్నరప్‌గా నిలిచిన మహబూబాబాద్ జట్లకు అతిథులు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు ఉపేందర్, రాము, మట్టెడ కుమార్, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అతిథులు

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో నిర్వహించిన అండర్-15 విభాగం పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదరంగం పోటీలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. విజేతలు నవంబరు 3 నుంచి 11 వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. చీఫ్ ఆర్బిటర్ సాయిప్రసాద్, ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

విజేతలు: బాలుర విభాగంలో యోహాన్ యాదవ్, ప్రణయ్, అంజనికుమార్, సాహర్ష, బాలికల విభాగంలో యాశ్విజైన్, శరణ్య, సహర్ష, శ్రీలాస్య తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు.

మూసీ పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేయాలి



రహదారి పనులు పరిశీలిస్తున్న సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పార్టీ సమావేశానికి హాజరై ఖమ్మం వెళ్తూ.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఎల్కతుర్తి - సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి పనులు నాసిరకంగా సాగుతున్నాయని, దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆచార్య సాయిబాబు మృతి కేంద్ర ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. ఇటీవల హరియాణాలో జరిగిన ఎన్నికల్లో భాజపాది నిజమైన విజయం కాదని, కాంగ్రెస్ వైఫల్యంతో అధిక సీట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడువులోపు హామీలను అమలు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత అవసరం



కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేటలో నిర్మిస్తామంటున్న కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కాజీపేట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అయోధ్యపురంలో వ్యాగన్ తయారీ కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జీఎంతో జరిగే సమావేశంలో ప్రస్తావిస్తానని, తర్వాత రైల్వే శాఖ మంత్రిని కలుస్తానని చెప్పారు. జిల్లా వాసుల చిరకాల స్వప్నం కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాజీపేట - బల్లార్షా మార్గంలో నాలుగు లైన్ల నిర్మాణం పూర్తికావడంతో కాజీపేట మీదుగా మరిన్ని రైళ్లు తిరిగే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా ప్లాటుఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేట స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, విశ్రాంత గదుల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేటలో బస్టాండ్ లేక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే స్థలం ఇస్తే బస్టాండ్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం రైల్వే ఆసుపత్రిని సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఈ లక్ష్మీనారాయణ, సీనియర్ డీఈఎన్ వెంకట్, సీడీఎం అనికేత్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ పాల్గొన్నారు.

మోడు వారి.. ప్రమాదకరంగా మారి..!



గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ క్రాస్ నుంచి లక్నవరం జలాశయానికి వెళ్లే మార్గంలో కొన్ని వృక్షాలు మోడువారిపోయి దర్శనమిస్తున్నాయి. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు జలాశయానికి వెళ్తుంటాయి. వేలాది మంది పర్యటకులు వస్తుంటారు. ఇటీవల తరచుగా అకాల వర్షాలు, ఈదురు గాలులు వీస్తున్న విషయం తెలిసిందే. ఎండిపోయిన వృక్షాలు పెనుగాలులకు విరిగిపడకముందే అధికారులు మేల్కొని తొలగిస్తే మేలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు సైతం ప్రయాణిస్తుంటారు. ముందస్తుగానే తొలగించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గోవిందరావుపేట

నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు



ఏటూరునాగారం మండల పరిధి చిన్నబోయినపల్లి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద 163 జాతీయ రహదారి పక్కన నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిర్వహణలేమితో నిరుపయోగంగా మారాయి. నీటివసతి లేకపోవడంతో వాటిని వినియోగించడం లేదు. గ్రామస్థులు, బాటసారులు, వాహనదారుల అవసరార్థం, ప్రత్యేకంగా మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం 2022 సంవత్సరంలో రూ.10 లక్షలు వెచ్చించి వీటిని నిర్మించారు. పది మందికి ఉపయోగపడాల్సిన మరుగుదొడ్లు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో నిర్వహణ కరవైంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి కృష్ణారావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

– న్యూస్‌టుడే, ఏటూరునాగారం

వేసవిలో తాగునీటి ఎద్దడి రావొద్దు

వాజేడు, న్యూస్‌టుడే: రానున్న వేసవిలో తాగునీటికి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయ, ఎంపీవో శ్రీకాంత్ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుల సమీక్ష సమావేశంలో తాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలను గుర్తించి నివేదిక అందించాలన్నారు. చేతిపంపులు, మంచినీటి పథకాలకు అవసరమైన సామగ్రిని నివేదించాలని సూచించారు. గ్రామాలలోని పల్లెప్రకృతి వనాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలకు సాసర్ పిట్లను ఏర్పాటు చేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140

ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

స్పందనకు వందనం

పైపులైన్‌కు మరమ్మతు



మంగపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పైపులైన్ లీకేజీతో తాగు నీరు వృథాగా పోతోందని సమీప టీచర్స్ కాలనీ వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు వివరించగా, ఆయన స్పందించారు. పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి పైపులైన్‌కు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

చేతిపంపు బాగు



వెంకటాపూర్: మండలంలోని పాలంపేటలోని బి.సాంబయ్య ఇంటి సమీపంలోని చేతిపంపు వారం రోజుల క్రితం పాడైపోయిందని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను పంచాయతీ కార్యదర్శికి వివరించగా, ఆయన స్పందించారు. పంపు మెకానిక్ ఖరీమ్‌తో బాగు చేయించారు.

అదనపు నియంత్రికల ఏర్పాటు



ములుగు రూరల్: మండలంలోని జాకారం, అబ్బాపురం గ్రామ పరిధిలోని బాణాలపల్లిలో బుధవారం విద్యుత్తు అధికారులు అదనపు విద్యుత్తు నియంత్రికలను ఏర్పాటు చేశారు. అధిక లోడ్‌తో గ్రామాలలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు విన్నవించారు. సమస్యను విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఏఈ వేణుగోపాల్ వెంటనే స్పందించి ఆయా గ్రామాలకు అదనపు విద్యుత్తు నియంత్రికలను ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

క్రెచ్ సెంటర్ల ఏర్పాటు సరికాదు



డీడబ్ల్యూఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అంగన్‌వాడీ సెంటర్లలో కొత్తగా ప్రారంభిస్తున్న క్రెచ్ సెంటర్ల ఏర్పాటు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ.. డీడబ్ల్యూఓ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు బుధవారం ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగులను కార్యాలయంలోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి సమ్మక్క మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్లలో క్రెచ్ సెంటర్లు ఏర్పాటు తగదని, ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు జమునారాణి, రమాదేవి, ధనలక్ష్మి, రమాదేవి, ధన లక్ష్మిచ సరిత, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సవరణలు చేయాలని వినతి

ములుగు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రెచ్ సెంటర్ల ఏర్పాటులో కొన్ని సవరణలు చేయాలని కోరుతూ టీఎన్‌జీవోల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలురాజు, అంగన్‌వాడీల సంఘం ములుగు జిల్లా అధ్యక్షురాలు ఎనగందుల సునిత మాట్లాడారు. క్రెచ్ కేంద్రాల ఏర్పాటులో ఎలాంటి అభ్యంతరం లేదని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఎలాంటి బాధ్యతలు అప్పగించకూడదని తెలిపారు. జిల్లా కన్వీనర్ రేగూరి సరోజ, కార్యదర్శి అనుమాండ్ల భాగ్య, కోశాధికారి పుట్ట దేవిక, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు



నల్లగుంటలో మాట్లాడుతున్న ములుగు సీఐ శంకర్

వెంకటాపూర్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు వెంకటాపూర్ మండలంలోని నల్లగుంటలో ఎస్ఐ జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ములుగు సీఐ శంకర్ హాజరై గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పోలీసులు సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.. గుడుంబా, గుట్కా వంటి నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా.. కొనుగోలు చేసినా సమాచారం అందించాలని, చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



తాడ్వాయి, న్యూస్‌టుడే: మండలంలోని కొడిశాల గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి సిద్దబోయిన సంజయ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. గత ఆదివారం హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో సంజయ్ తన అద్భుత ఆటతీరుతో ములుగు జట్టును ప్రథమ స్థానంలో నిలిపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థి సంజయ్, పీడీ ఆదినారాయణను ప్రధానోపాధ్యాయుడు దేవదాస్, డిప్యూటీ వార్డెన్ కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు జగపతిరావు, రవీందర్, చొక్కారావు, లక్ష్మయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, అశోక్, శేషగిరి, సాంబయ్య, భాస్కర్ తదితరులు అభినందించారు.

నిరుపేదలకు సాయం అభినందనీయం



సామగ్రిని పంపిణీ చేస్తున్న సీఐ కుమార్, ఎస్సై తిరుపతిరావు, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్థురాజు, తదితరులు

వెంకటాపురం, న్యూస్‌టుడే: నిరుపేదలకు కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆపన్నహస్తం అందించడం అభినందనీయమని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. చేయూత కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆ సంస్థ ప్రాంగణంలో బుధవారం వాజేడు, వెంకటాపురం మండలాల్లోని సుమారు 300 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 వేల విలువైన నిత్యావసర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన సీఐ కుమార్, ఎస్సై తిరుపతిరావులు మాట్లాడారు. స్వచ్ఛందంగా సేవ చేయాలనే తలంపుతో ఇక్కడ ఏర్పాటైన కాఫెడ్ సంస్థ పేదలకు ఆపన్నహస్తంగా మారిందన్నారు. కుల మతాలకు అతీతంగా మానవత్వంతో సహకారం అందించిన సంస్థ పనితీరును కొనియాడారు. పల్లె ప్రజలకు మరిన్ని సేవలు అందించాలన్నారు. సఖి విభాగం జిల్లా సభ్యురాలు కల్పన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, మహిళలపై వేధింపులు, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పరంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. న్యాయపరమైన సహకారం సైతం అందిస్తామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్థురాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు, బాలల పరిరక్షణ విభాగం బాధ్యులు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

తెరమరుగు!

● ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్లలో 15 థియేటర్ల మూత

ఒక థియేటర్ నడవడం వల్ల నగరంలో 10 మంది, గ్రామీణ ప్రాంతాల్లో అయిదుగురు ఉపాధి పొందుతారు.

జిల్లాల వారీగా వివరాలు

	● ప్రస్తుతం నడుస్తున్న థియేటర్లు	● మూతబడినవి
త్రినగరి పరిధి	10	12
ములుగు	03	02
జనగామ	03	01

ఒకప్పుడు సినిమా విడుదల ఉందంటే థియేటర్ల వద్ద పండగ వాతావరణం ఉండేది. ప్రధానంగా దసరా, దీపావళి, సంక్రాంతి పండగల వేళ కొత్త సినిమాలతో నెలకొనే కోలాహలం అంతా ఇంతా కాదు. ఇంటిల్లిపాది సినిమా చూస్తేనే పండగకు నిండుదనం వచ్చేది. కానీ! కరోనా తర్వాత సంక్షోభంలోకి వెళ్లిన వెండితెర పూర్తిస్థాయిలో కోలుకోలేదు. వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరిలోనే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లు క్రమంగా మూతబడుతున్నాయి. గత ఐదేళ్లలో 15 థియేటర్లు మూసేశారు.



వరంగల్ నగరంలోని రామ్‌లక్ష్మణ్ టాకీస్ ఇది. పెద్ద హీరోల సినిమాలు విడుదలైనప్పుడు తెరిచి ఆ తర్వాత మూసివేస్తున్నారు



మట్టెవాడలో మూతబడిన కాకతీయ కాంప్లెక్సు

ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్‌గా..


కొన్ని టాకీస్‌లు వేడుకల మందిరంగా మారుతుండగా.. మరికొన్ని వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ప్రేక్షకులు ఇంట్లో రంగురంగుల టీవీల్లో, చరవాణుల్లో ఓటీటీల ద్వారా సినిమాలు చూస్తున్నారు. దీంతో సినిమా టాకీస్‌లపై ఆధారపడ్డ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. అమ్మలా ఆదరించిన సినీ కళామతల్లికి ఇంతటి కష్టమొస్తుందని అనుకోలేదని థియేటర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ నగరంలో సినిమా థియేటర్ల మూసివేత, కూల్చివేతలు గత మూడేళ్లలో ఎక్కువయ్యాయి.



వరంగల్ స్టేషన్‌రోడ్డులో థియేటర్ తొలగించి వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్న యాజమాన్యం


– న్యూస్‌టుడే, కాశీబుగ్గ, రంగశాయిపేట

10 శాతం మందే ఆధారపడుతున్నారు - రమేష్ తెలంగాణ ఎగ్జిబ్యూటర్ అసోసియేషన్ ఈసీ సభ్యుడు, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి



రోజురోజుకు భూముల విలువ పెరుగుతుండటంతో థియేటర్లు తొలగించి.. ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 10 శాతం యజమానులు మాత్రమే సినిమాలపై ఆధారపడుతున్నారు. థియేటర్ల పరిస్థితి బాగాలేదు. లాభాలు లేవు. ఇప్పుడు 90 శాతం మంది లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నారు. లాభాలు లేక వారి పరిస్థితీ దయనీయంగా ఉంది. సింగిల్ థియేటర్ల మనుగడ కొనసాగాలంటే కనీసం విద్యుత్తు బిల్లులపై ప్రభుత్వం రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

40 ఏళ్లుగా పనిచేస్తున్నా..: - మహ్మద్ దస్తగిరి, సినీ కార్మికుడు



వరంగల్ అజంజాహి మిల్లు సమీపంలో 40ఏళ్ల క్రితం వెంకట్రామా టాకీస్ కట్టారు. మొదట నెలకు రూ.240 జీతానికి టికెట్ కౌంటరులో పనిచేశా. గతంలో కొత్త సినిమా విడుదల అవుతుందంటే టాకీస్ యజమానితో పాటు మాకు ఎంతో గౌరవం ఉండేది. మూడేళ్లుగా టాకీస్‌లు సరిగా నడవక, ప్రేక్షకులు సరిగా రాక థియేటర్ల యజమానులు నష్టపోతున్నారు. థియేటర్లకు మళ్లీ పూర్వ వైభవం రావాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం నెలకు రూ.8 వేల జీతానికి థియేటర్ కాపలాదారుగా పనిచేస్తున్నా.

రాబడి లేదు..: - గండె నవీన్, హీరో మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు కొత్త సినిమాలు విడుదల అయ్యే రోజు అభిమానులుగా మాకు పండగే. సినిమా విడుదలకు ముందు రోజు థియేటర్లను పెళ్లి మండపంలా ముస్తాబు చేసేవాళ్లం. ఇప్పుడు కొత్త సినిమాలు వస్తున్నా.. గతంలో ఉన్నంత ఆనందం కలగట్లేదు. నాడు ఒక సినిమా విడుదలైతే వంద రోజులు, సంవత్సరం పాటు నడిచేవి. ప్రస్తుతం ఒకేరోజు ఎక్కువ ఆటలు ఆడిస్తున్నారు. అయినా థియేటర్ల యాజమాన్యానికి రాబడి లేదు.

కుమురంభీం విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారంలో ఈ నెల 24న నిర్వహించనున్న కుమురంభీం విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతో పాటు రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర, అరకు ఎమ్మెల్యే రేగా మచ్చలింగం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎమ్మెల్యే విక్రమ్ మండవి, తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ పొదెం రత్నం తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఆదివాసీలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు తదితరులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విగ్రహ ఏర్పాటుకు రూ.50 వేలు వితరణ



ఏటూరునాగారం: ఏటూరునాగారంలోని వై జంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్న కుమురం భీం విగ్రహావిష్కరణకు భారాస జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని మండల నాయకులు ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు పొదెం కృష్ణప్రసాద్, చెరుకుల ధర్మయ్య, ఈసం నర్సయ్యలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సునీల్‌కుమార్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఖాజాపాషా, రాంనర్సయ్య, నర్సయ్య, రాంబాబు, భోజారావు, రామకృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ఏటూరునాగారం: కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు నామా కరంచంద్ గాంధీ, నాయకులు వావిలాల చిన్నఎల్లయ్య, ఖలీల్‌ఖాన్, గుడ్ల దేవేందర్, ముక్కెర లాలయ్య, సలీంపాషా, సొదారి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మండల పరిధిలో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ది నర్సింహరావు, జిల్లా కార్యదర్శి తూడి భగవాన్‌రెడ్డి, మండల కార్యనిర్వాహక అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, బీసీ, ఎస్టీ, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ముత్తినేని ఆదినారాయణ, చాద మల్లయ్య, టీవీ హిదయతుల్లా, గ్రామ కమిటీ అధ్యక్షులు సయ్యద్ ఉస్సేన్ నాయకులు బుచ్చిరెడ్డి, బాలయ్య, హరికృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట, పస్రా, కర్లపల్లి గ్రామాల్లోని ఏడుగురు లబ్ధిదారులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలోని నాయకులు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. నాయకులు ఆర్.సీతారాంనాయక్, కె.నాగేందర్‌రావు, జె.సోమయ్య, పి.వెంకన్న, ఎస్.సాయి కుమార్, డి.కృష్ణ, జె.చంద్రశేఖర్, కె.రవి, కె.సమ్మిరెడ్డి, ఎం.నాగమణి, సునిత, వసంత, ఆర్.వెంకటేశ్వర్‌రావు, బి.లింగారెడ్డి, పి.శ్రీను, ఎస్.కృష్ణ, శాంత, ఎం.దామోదర్‌రెడ్డి, టి.శివ, ఎండీ.మాజిత, జి.బజ్రమ్మ, పి.మల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



సభ్యత్వాలను అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

వాజేడు, న్యూస్‌టుడే: కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్యను అందించేందుకు కృషిచేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సతీశ్‌కుమార్, మధుసూదన్ అన్నారు. ఉపాధ్యాయ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో భాగంగా వాజేడు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి కొత్తగా చేరిన వారి నుంచి సభ్యత్వాలను నమోదు చేశారు. కార్యక్రమంలో వాజేడు, వెంకటాపురం మండలాల అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, రామారావు, రమణయ్య తదితరులు ఉన్నారు.

సీపీఎం మండల కార్యదర్శి ఎంపిక

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: సీపీఎం పార్టీ మండల కార్యదర్శిగా చిటమట రమేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఏటూరునాగారంలో బుధవారం సీపీఎం పార్టీ మండల మహాసభ నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎండీ.దావూద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల కార్యదర్శిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి, నాయకులు తనపై విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తిస్తానని రమేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రాజశేఖర్



తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా తాడ్వాయికి చెందిన రేగ రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాడ్వాయి మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల రవి సమక్షంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా కొర్నిబెల్లి సతీష్‌కుమార్, కార్యదర్శిగా బానోత్ సునీత, సంయుక్త కార్యదర్శిగా ఈసం శారద, కోశాధికారిగా కూరాకుల ప్రశాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా అజ్మీర ధర్మేందర్, సభ్యులుగా రమేష్, జ్ఞానేశ్వరి, భాగ్యరాణి, నర్మద, రజిత, భార్గవ్ చందులాల్ తదితరులు ఎన్నికయ్యారు.

కరెంటు షాకుతో వృద్ధురాలికి గాయాలు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: కరెంటు షాకుతో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోమిడి కేలోత్ మిర్చి పంటకు నీరు పెట్టేందుకు తన వ్యవసాయ బోరుబావి వద్ద వెళ్లారు. బోరు మోటారు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురికావడంతో.. గాయపడ్డారు. స్థానిక రైతులు గమనించి ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సెల్ఫీ వీడియో తీసి.. ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజేష్

ములుగు టౌన్, న్యూస్‌టుడే: ములుగు మండలం మల్లంపల్లి గ్రామంలోని ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో బుధవారం చక్కర్లు కొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లికి చెందిన దూమల రాజేష్‌కు అదే గ్రామానికి చెందిన యువతితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. 20 రోజుల క్రితం భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో రాజేశ్ భార్య తన తల్లిగారింటికి వెళ్లింది. మంగళవారం రాత్రి ఓ నీటి శుద్ధియంత్రం వద్ద తన ఇద్దరు పిల్లలు ఆడుకుంటుండగా తీసుకెళ్లే క్రమంలో గ్రామానికి చెందిన బక్కి నాగరాజు, ల్యాద శ్యాంరావు, మాజీ సర్పంచ్ గోల్కొండ రవి, గోపీ అనే వ్యక్తులు వచ్చి రాజేశ్‌తో గొడవపడ్డారు. దీంతో రాజేశ్ తన అత్తగారింటికి వెళ్లిన క్రమంలో ల్యాద శ్యాం, గోపీలు వచ్చి తనను కొట్టారని, బక్కి నాగరాజు కొట్టడానికి చేయి ఎత్తాడని కంటతడి పెడుతూ.. నా చావుకు వీరే కారణమంటూ పురుగు మందు తాగి వీడియోను 'మన మల్లంపల్లి' అనే వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వరరావు తన సిబ్బందిని అప్రమత్తం చేసి చరవాణి లొకేషన్ ఆధారంగా నీరుకుళ్ల వద్ద ఉన్నట్లు గుర్తించారు. ములుగు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

పీఆర్‌టీయూ నాయకుల విస్తృత ప్రచారం



చల్వాయిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ టీఎస్ తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీపాల్‌రెడ్డికి ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యం ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు యాకుబ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాకుబ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులకు సైతం ఏజెన్సీ అలవెన్సులు ఇప్పించే విషయంలో తాము ప్రయత్నిస్తామని చెప్పారు. అంతే కాకుండా ఉపాధ్యాయరంగ సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కణతల నాగేందర్‌రావు, నాయకులు పి.తులసీరాం, ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో అత్యున్నత ప్రతిభ చూపాలి



ప్రశంసాపత్రాలు అందజేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వాజేడు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన కళోత్సవంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరావు ప్రశంసా పత్రాలను అందజేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మల్లయ్య, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.